క్లుప్తంగా

నూతన కమిటీ ఎన్నిక



నూతన అధ్యక్షుడికి నియామక పత్రం అందజేస్తున్న సంఘం సభ్యులు

దోమ: అంబేడ్కర్ యువజన సంఘం దిర్సంపల్లి గ్రామ నూతన కమిటీని ఆ సంఘం సభ్యులు ఆదివారం ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు నియామక పత్రం అందజేశారు. గ్రామ అధ్యక్షుడుగా ఎం.వెంకటయ్య, ఉపాధ్యక్షుడిగా బద్రి, ప్రధాన కార్యదర్శిగా హన్మంతు, కోశాధికారిగా శ్రీనివాస్, సంస్కృత కార్యదర్శిగా తిరుమలేశ్, క్రీడా కార్యదర్శిగా కృష్ణ, మీడియా కార్యదర్శిగా కుమార్, ప్రచార కార్యదర్శిగా వెంకటయ్య, సలహాదారులుగా వెంకటయ్య, చిన్న నర్సింలు, బాలకృష్ణ, రాములు, కిష్టయ్య, అంజి, హన్మంతు, బందయ్య, బాబును నియమించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తామని చెప్పారు.

నేడు బీజేపీ యాత్ర

యాలాల: చెవేళ్ల పార్లమెంట్ నియోజకవర్గం యాలాల మండలంలో సోమవారం బీజేపీ ప్రజా ఆశీర్వాద యాత్ర నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు జంగం యాదగిరి, ప్రధాన కార్యదర్శులు అరుణ్‌కుమార్, కాశీనాథ్, మధుగౌడ్‌లు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా రానున్నారని తెలిపారు. తొలుత రాస్నం గ్రామం నుంచి యాత్ర ప్రారంభించి.. పగిడియాల, బాగాయిపల్లి, రాఘవపూర్, కోకట్, లక్ష్మీనారాయణపూర్, చెన్నారం, అక్కంపల్లి, పగిడిపల్లి, జుంటుపల్లి, అగ్గనూరు వరకు కొనసాగుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలని కోరారు.

ఘనంగా రామలింగేశ్వరుడి బ్రహ్మోత్సవాలు



హోమం చేస్తున్న అర్చకులు

కుల్కచర్ల: శ్రీ పాంబండ రామలింగేశ్వరుడి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం స్వామి వారికి అర్చకులు హోమాలు, సర్వదర్శనాలు, పల్లకీ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఇదిలా ఉండగా.. మార్చి 30న ప్రారంభమైన ఉత్సవాలు, ఈ నెల 9వ తేదీన ముగియనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

ధారూరు: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా ఆదివారం ధారూరులోని తాండూర్–హైదరాబాద్ ప్రధాన రోడ్డులో ఎస్‌ఐ వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా ఈసీ ఆదేశాల మేరకు సోదాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. అక్రమంగా నగదు, తదితర వస్తులను తీసుకెళ్లరాదని పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత



నిర్వాహకులతో అనితారెడ్డి, తీగల కృష్ణారెడ్డి

కందుకూరు: దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని జెడ్పీ చైర్ పర్సన్ తీగల అనితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి తెలిపారు. మండల పరిధి దెబ్బడగూడలో ఈదెమ్మ ఆలయ మూడో వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు వరికుప్పల జగన్, దేరంగుల జంగయ్య, ఆంజనేయులు, రాజు, నర్సింహ, శ్రీను, రామకృష్ణ, యాదయ్య ఆధ్వర్యంలో అమ్మవారి కల్యాణం అనంతరం బోనాలు సమర్పించారు. బలి కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ జంగారెడ్డి, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఏనుగు శ్రావణి, జంగయ్య తదితరులు పూజలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

దామగుండం.. దర్శిద్దాం

- 3 నుంచి రామలింగేశ్వర స్వామి ఉత్సవాలు
- తెలంగాణతో పాటు, పొరుగు ప్రాంతాల నుంచి తరలి రానున్న భక్తజనం



ఆలయ పుష్కరిణి



ఆలయంలో కొలువుదీరిన రామలింగేశ్వరుడు

పూడూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన దామగుండ రామలింగేశ్వర స్వామి ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా భక్తుల విశ్వాసం చూరగొన్న స్వామివారి దర్శనం కోసం తెలంగాణ నలుమూలల నుంచే కాకుండా.. పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తజనం తరలి రానున్నారు. ఆలయం చుట్టూ కొండలు, పచ్చని చెట్ల మధ్య ప్రకృతి రమణీయతతో ఉట్టిపడే ఆహ్లాదకరమైన వాతావరణంలో దట్టమైన అడవిలో కొలువుదీరిన స్వామివారిని దర్శనం చేసుకుంటే.. సకల శుభాలు కలగడమే కాకుండా, పుష్కరిణిలో స్నానమాచరిస్తే యమగండం తప్పుతుందని భక్తజనం నమ్ముతారు.

3వ తేదీ నుంచి ఉత్సవాలు

రామలింగేశ్వర స్వామి ఉత్సవాలు ఈ నెల 3 నుంచి ప్రారంభం కానున్నాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. 3న బుధవారం అఖండ దీపారాధన, ధ్వజారోహనం, 4న తెల్లవారు జామున అగ్నిగుండం, రుద్రాభిషేకం, పార్వతీ రామలింగేశ్వరుల కల్యాణం, రాత్రి 10 గంటలకు రథోత్సవం, 5న శుక్రవారం సహస్ర బిల్వార్చన, రాత్రి దోపోత్సవం, 6న రుద్రాభిషేకం, సహస్ర పుష్పార్చన, 7న రుద్రాభిషేకం, చక్రతీర్థం కార్యక్రమాలు ఉంటాయని ఆలయ పూజారులు భీమాచార్యులు, నర్సింహాచార్యులు పేర్కొన్నారు.

దామగుండానికి దారి..

పూడూరు మండలంలో వెలసిన దామగుండ పుణ్యక్షేత్రానికి చేరుకోవాలంటే హైదరాబాద్–బీజాపూర్ ప్రధాన రోడ్డుపై నుంచి మూడు కిలో మీటర్ల దూరం వెళ్లాల్సి ఉంటుంది. వికారాబాద్ నుంచి వెంకటాపూర్‌తండా, గుడుపల్లి గ్రామం మీదుగా రోడ్డు సౌకర్యం ఉంది. క్షేత్రం మీదుగా ప్రైవేటు వాహనాలు తిరుగుతాయి.

ఆలయ చరిత్ర



రామలింగేశ్వర స్వామి ఆలయం

రామలింగేశ్వర స్వామి ఆలయానికి సుమారు ఐదు శతాబ్దాల చరిత్ర ఉంది. పూర్వంలో దాముడు, గుండడు అనే ఇద్దరు అన్నదమ్ములు ఈ ప్రాంతంలో వ్యవసాయం చేస్తుండేవారు. నాగలిపై బరువు ఉంచడం కోసం ఒక రాయిని పెట్టి పొలాన్ని దున్నేవారు. సాయంత్రం నాగలిపై రాయిని అలాగే వదిలి వెళ్లేవారు. ఉదయం వచ్చి చూసే సరికి నాగలిపై ఉన్న రాయి.. యథాస్థానానికి చేరేది. ఇలా రెండు మూడు రోజులు జరిగింది. విషయం గమనించిన రైతులు, ఈ ప్రాంతంలో ఏదో మహిమ ఉందని ఆలోచించసాగారు. అక్కడ ఒక మునీశ్వరుడు ప్రత్యక్షమై, ఈ రాయి సాక్షాత్తు రామలింగేశ్వరుడని వారికి చెప్పాడు. దీంతో ఆ శిల ఉన్న ప్రాంతంలోనే రాయిని ప్రతిష్ఠించి పూజించారు. దాముడు గుండుడు ప్రతిష్ఠించిన ఈ ప్రాంతానికి దామగుండం అనే పేరు వచ్చిందని పూర్వీకులు పేర్కొంటున్నారు.

సహకార సంఘం అభివృద్ధికి కృషి

- అర్హులందరికీ రుణాలు
- అందుబాటులో ఎరువులు
- పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాంచంద్రారెడ్డి

బంట్వారం: వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నానని పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అర్హులైన రైతులకు స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు ఇస్తున్నామని తెలిపారు. తీసుకున్న రుణాలను వాయిదా ప్రకారం చెల్లిస్తే వడ్డీ తక్కువగా ఉంటుందని చెప్పారు. రికవరీ 50 శాతం కంటే ఎక్కువగా ఉంటేనే, నాబార్డు లాంటి సంస్థలు మరింత ఎక్కువగా అప్పు ఇస్తాయని వెల్లడించారు.

త్వరలో గోదాం నిర్మాణం..

రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచి, పంపిణీ చేస్తున్నామని చైర్మన్ వెల్లడించారు. త్వరలోనే ఎరువుల గోడౌన్ నిర్మాణం చేపడతామని, ఇప్పటికే స్థల సేకరణ పూర్తయిందని స్పష్టం చేశారు. సొసైటీలో తక్కువ వడ్డీకే బంగారం తాకట్టుపై రుణ సదుపాయం ఉందని, ఆసక్తి ఉన్నవారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంఘం అభివృద్ధికి అన్నదాతలు సహకరించాలని కోరారు. అంతకు ముందు సీఈఓ బ్రహ్మం.. జమా ఖర్చుల లెక్కలను సభలో చదివి వినిపించారు. సొసైటీ డైరెక్టర్లు సుదర్శన్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, రాధాకృష్ణగౌడ్, మధుసూదన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేటి తరానికి ఆమె ఆదర్శం



మంజుభాషిణిని సన్మానిస్తున్న సంఘం నాయకులు

యాలాల: ఉపాధ్యాయురాలు మంజుభాషిణిని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని పీఆర్‌టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకటరాంరెడ్డి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, యాదయ్యగౌడ్‌లు సూచించారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలిగా పనిచేసి, ఉద్యోగ విరమణ పొందిన ఆమెను సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చిన్న వయసులో ఉపాధ్యాయ వృత్తిలో చేరిన ఆమె, అంచెలంచెలుగా ఎదిగారని తెలిపారు. ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని, విద్యార్థుల భవితకు బాటలు వేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర బాధ్యులు మొగులయ్య, వెంకట్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, జిల్లా బాధ్యులు కృష్ణారెడ్డి, శ్రీనివాస్, రమేష్, బాలగోవింద్‌రెడ్డి, పరమేష్, రాములు, రాజేష్ తదితరులు ఉన్నారు.

కమిటీ నియామకం



నూతన అధ్యక్షుడికి నియామక పత్రం అందజేస్తున్న చుక్కయ్య

దోమ: వికలాంగుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేయాలని భారత వికలాంగుల పరిరక్షణ సమితి మండల అధ్యక్షుడు చుక్కయ్య కోరారు. ఆదివారం మండల కేంద్రంలో సమితి నూతన గ్రామ కమిటీలను ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మహేశ్, ప్రధాన కార్యదర్శిగా బోయిని వెంకటయ్య, కార్యదర్శిగా శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా రమేశ్, మీడియా కన్వీనర్‌గా శివకుమార్, కోశాధికారిగా రాజు, పలువురు సభ్యులను నియమించారు. అనంతరం నూతన అధ్యక్షుడికి నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వీరప్ప, రాజునాయక్, మహేశ్, ఆనందం తదితరులు పాల్గొన్నారు.

మల్కాపూర్‌లో తాగునీటి ఎద్దడి

కాలిపోయిన మోటారు.. మరమ్మతుకు నోచుకోని వైనం



ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు

తాండూరు రూరల్: అసలే వేసవి కాలం. మండుతున్న ఎండలు. ఆపై నెలకొన్న తాగునీటి ఎద్దడితో ప్రజలు అల్లాడి పోతున్నారు. మండల పరిధి మల్కాపూర్‌లో తాగునీరు సమస్య తలెత్తింది. గ్రామంలోని 1, 2వ వార్డుకు నీటిని సరఫరా చేసే బోరు మోటారు మరమ్మతుకు గురై.. తాగునీరు లేక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో గ్రామ పంచాయతీ వాటర్ ట్యాంక్ ద్వారా నీటిని సరఫరా చేయగా.. అవి సరిపోవటం లేదని, అందరికీ అందడం లేదని ప్రజలు తెలిపారు. ఎండలతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నామని, దీనికి తోడు తాగునీరు సరఫరా లేక ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. నాలుగు రోజుల క్రితం బోరు మోటారు కాలిపోయిందని, అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రత్యేక అధికారి స్పందించి, మరమ్మతు చేయించి, నీటి కటకట తీర్చాలని కోరుతున్నారు.

పొగతో ఉక్కిరిబిక్కిరి!

- డంపుయార్డులో తరచూ చెలరేగుతున్న మంటలు
- దుర్వాసన, పొగతో సోలీపూర్ వాసుల ఇక్కట్లు
- రోగాల బారిన పడుతున్న జనం



సోలీపూర్ శివారులోని డంప్‌యార్డులో ఇటీవల మంటలు చెలరేగడంతో వ్యాపిస్తున్న పొగ

షాద్‌నగర్: రహదారులపై పడేసిన చెత్త, ఇళ్లలో నుంచి సేకరించిన చెత్త మొత్తం మున్సిపల్ సిబ్బంది ఊరి చివరన పారబోస్తున్నారు. చెత్త డంపు కారణంగా దుర్వాసన రావడంతో పాటు.. తరచూ మంటలు చెలరేగుతుండటంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. దీంతో అనారోగ్య సమస్యలు తలెత్తున్నాయని జనం వాపోతున్నారు. ఏళ్ల తరబడి డంపుయార్డు నిర్మాణం చేపట్టకపోవడం సోలీపూర్ గ్రామస్తులకు శాపంగా మారింది. త్వరగా నిర్మాణ పనులు పూర్తిచేసి, డంప్‌యార్డును తరలించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఇదీ సోలీపూర్ పరిస్థితి

మున్సిపాలిటీ పరిధిలో 28 వార్డులు ఉన్నాయి. సుమారుగా 15 వేలకుపైగా నివాసాలు ఉన్నాయి. లక్షకుపైగా జనాభా ఉంది. ప్రతిరోజు మున్సిపల్ సిబ్బంది సుమారు 4వేల కిలోల తడి, పొడి చెత్తను సేకరిస్తున్నారు. ఇందులో సుమారు 500 కిలోల వరకు కూరగాయల వ్యర్థాలను సేకరిస్తున్నారు. ఇంటింటి నుంచి చెత్త సేకరణ కోసం మున్సిపల్ అధికారులు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేశారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టేందుకు సుమారు 115 మంది పారిశుద్ధ్య సిబ్బంది పని చేస్తున్నారు. మున్సిపాలిటీలో ప్రతి రోజు ఇళ్ల నిర్మాణాల సంఖ్య పెరుగుతూనే ఉంది. పట్టణం విస్తరిస్తున్నప్పటికీ.. నేటికీ డంప్‌యార్డు లేకపోవడం గమనార్హం.

స్థానికులకు శాపం

పట్టణంలో సేకరించిన చెత్త అంతా మున్సిపాలిటీ పరిధిలోని సోలీపూర్ గ్రామ శివారులోని ప్రభుత్వ స్థలంలో పారబోయడం.. గ్రామస్తులకు శాపంగా మారింది. డంపుయార్డు రోడ్డు పక్కన గ్రామానికి సమీపంలో ఉండటంతో జనం అవస్థలు పడుతున్నారు. చెత్తతో గ్రామంలో ఈగలు, దోమలు విపరీతంగా వ్యాపించి గ్రామస్తులు రోగాల బారిన పడుతున్నారు. డంపుయార్డును ఇక్కడి నుంచి తరలించాలని ఎన్నో ఏళ్లగా స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అయినా అధికారులు తగిన రీతిలో స్పందించడం లేదు.

చెలరేగుతున్న మంటలు

సోలీపూర్ శివారు చెత్త డంపుయార్డులో తరచుగా మంటలు చెలరేగుతున్నాయి. చెత్తకు ఎవరైనా నిప్పు పెడుతున్నారా, లేక రసాయనాలతో మంటలు పుట్టుకొస్తున్నాయ అనేది అర్థం కాని పరిస్థితి. మంటలు వచ్చినప్పుడు వెలువడే దుర్వాసనతో కూడిన పొగ గ్రామాన్ని పూర్తిగా కమ్మేస్తోంది. దీనిని పీలుస్తున్న ప్రజలు ఉక్కిరి బిక్కిరవుతున్నారు. ఫలితంగా జనానికి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి.

పనులు ఎప్పటికి పూర్తయ్యేనో..

చెత్త సమస్యకు స్వస్తి పలకాలని మున్సిపల్ అధికారులు, పాలక మండలి సభ్యులు చర్యలు చేపట్టారు. షాద్‌నగర్ శివారులోని సీఎస్‌కే వెంచర్ వెనక భాగంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో డంపుయార్డు నిర్మాణానికి సుమారు రూ.12 లక్షలు కేటాయించారు. ఏళ్ల తరబడి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులు త్వరగా పూర్తి చేసి సమస్యను పరిష్కరించాలని సోలీపూర్ వాసులు డిమాండ్ చేస్తున్నారు

రోగాల బారిన పడుతున్నాం



డంపుయార్డులో తరచుగా మంటలు చెలరేగుతున్నాయి. దీంతో విపరీతమైన పొగ వ్యాపిస్తోంది. ఫలితంగా శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నాం. డంప్‌యార్డు తరలించేందుకు అధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలి.

– జంగయ్య, సోలీపూర్

త్వరగా పూర్తి చేయాలి



చెత్తతో విపరీతమైన దోమలు, ఈగలు వ్యాపిస్తున్నాయి. ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నాం. నూతనంగా నిర్మిస్తున్న డంప్‌యార్డు పనులు త్వరగా పూర్తి చేయాలి.

– మారుతి, సోలీపూర్

కేంద్రంలో మరోసారి మోదీ ప్రభుత్వమే

బీజేపీ జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి

చేవెళ్ల: కేంద్రంలో మరోసారి మోదీ సర్కారే అధికారంలోకి రాబోతుందని బీజేపీ జిల్లా కార్యదర్శి గుండన్నగారి వెంకట్‌రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి దేశ ప్రజల మద్దతు ఉందని, ప్రజలు మరోసారి నరేంద్ర మోదీ ప్రభుత్వాన్నే కోరుకుంటున్నారని తెలిపారు. దేశాభివృద్ధి మోదీతోనే సాధ్యమని పేర్కొన్నారు. దేశంలో అవినీతిరహిత, కుంభకోణాలు లేని పాలన అందించిన ఘనత మోదీకే దక్కుతుందని స్పష్టం చేశారు. దేశానికి మోదీ లాంటి శక్తి వంతమైన ప్రధానమంత్రి అవసరమన్నారు. పార్టీని ఓడించాలని కాంగ్రెస్‌తో పాటు ఇతర విపక్షాలన్నీ ఏకమై దండయాత్ర చేస్తున్నాయని విమర్శించారు. దేశ ప్రజలందరూ మోదీ వెనకాల ఉన్నారన్న విషయాన్ని ఆ పార్టీల నేతలు మరిచిపోయారని ఎద్దేవా చేశారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా.. బీజేపీ హ్యాట్రిక్ విజయం ఖాయమని ఆశాభావం వ్యక్తంచేశారు. చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపంచుకునేందుకు పార్లమెంటు నియోజకవర్గ ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఇక్కడ విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించి, మోదీకి చేవెళ్ల సీటును కానుకగా ఇవ్వనున్నట్లు ఆయన వెల్లడించారు.

నేడు బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం

చేవెళ్ల: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీఆర్‌ఎస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం సోమవారం చేవెళ్లలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్ తెలిపారు. కేజీఆర్ గార్డెన్‌లో ఉదయం 10 గంటలకు ఈ సమావేశం ఉంటుందన్నారు. సమీక్షకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు అందరూ సమీక్షకు సకాలంలో హాజరుకావాలని కోరారు. సమావేశానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే సబితారెడ్డి, చేవెళ్ల అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, అరికేపూడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు తదితరులు హాజరవుతున్నట్లు చెప్పారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యేలు మనోహర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి

కాంగ్రెస్ గెలుపే లక్ష్యం

యాలాల: పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. ఆదివారం డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిల సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీ అచ్యుతాపూర్ మాజీ సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, రాఘవపూర్ నాయకుడు అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో రంజిత్‌రెడ్డి విజయానికి కృషి చేస్తామని చెప్పారు.

అపరిశుభ్రతతో అనారోగ్యం

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలంటూ చిన్నారుల ర్యాలీ



అవగాహన కల్పిస్తున్న చిన్నారులు

తాండూరు టౌన్: పలకపై అక్షరాలు దిద్దాల్సిన ఆ చిట్టిచేతులు.. ప్లకార్డులు చేతబూనాయి. బుడిబుడి అడుగులతో వీధివీధిలో తిరిగి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాయి. స్థానిక వినాయక మందిరంలో నిర్వహిస్తున్న బాలగోకులానికి చెందిన చిన్నారులు ఆదివారం.. ఆదర్శనగర్, తులసీనగర్ వార్డుల్లో.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలంటూ ర్యాలీ నిర్వహించారు. చెత్తను రోడ్లపై, మురుగు కాలువల్లో వేసి, అపరిశుభ్రతకు పాల్పడరాదని సూచించారు. అపరిశుభ్రత వలన.. దోమలు, ఈగల బెడద పెరిగి అనారోగ్యం పాలవుతామని తెలిపారు. చెత్తను చెత్త బుట్టల్లో వేసి, మున్సిపల్ చెత్త సేకరణ వాహన సిబ్బందికి అందజేయాలని కోరారు. కార్యక్రమంలో బాలగోకులం ఉపాధ్యాయులు కొత్త శ్రీనివాస్, శంకరప్ప, మాతాజీలు నిర్మల, లక్ష్మి, అనసూయ, సంగీత, భారతి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కవాతు

కందుకూరు: జరగనున్న పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సీఐ మక్బూల్‌జానీ సూచించారు. ఆదివారం సాయంత్రం రంగారెడ్డి జిల్లా కందుకూరు మండల పరిధి నేదునూరు, బాచుపల్లి, పులిమామిడి, ధన్నారం, చిప్పలపల్లి గ్రామాల్లో సీఐఎస్‌ఎఫ్ కేంద్ర సాయుధ బలగాలతో కందుకూరు పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అరాచక శక్తులతో అప్రమత్తంగా ఉండి, శాంతి భద్రతలకు భంగం కలగకుండా ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రజలు సహకరించాలని కోరారు. అర్హులందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐఎస్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ, ఎస్‌ఐ సైదులు పాల్గొన్నారు.